క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : రాజంపేట పట్టణంతో పాటు మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజంపేట టౌన్‌తో పాటు సరస్వతీపురం, తాళ్లపాక సబ్‌స్టేషన్ నందు గల 11కేవీ ఫీడర్‌కు సమీపంలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

ఆలయ వార్షికోత్సవం నేడు


కార్యసిద్ధి వినాయకుడు

పెనగలూరు : మండల కేంద్రం పరిధికొత్తపల్లి గ్రామంలో నిర్మించిన కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు జరుపుతున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం తలమించి గిరీష్‌రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సాయంత్రం తలమంచి వెంకటరమణారెడ్డి(టీచర్) సౌజన్యంతో స్వామి వారి కల్యాణ వేడుకను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వార్షికోత్సవ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో శుక్రవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి గురుప్రసాద్ విస్తృతంగా వాహనాలను తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బులు నియంత్రణ కోసం ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

నాగుల చవితి పూజలు


పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : వాడవాడలా నాగుల చవితి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఇళ్లలో తలంటు స్నానాలు ఆచరించి నాగుల పుట్ట వద్దకు చేరుకున్నారు. పుట్టకు దారంతో మూడు సార్లు చుట్టి పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించి మొక్కులు తీర్చుకలున్నారు. అనంతరం పుట్టకు పాలు పోసి పూజలు చేశారు. తరువాత ఇంటి నుంచి తీసుకొచ్చిన నువ్వులు, పెల్లం ఉండలు, బియ్యం, సజ్జలు పంచిపెట్టారు. ఇంటికి వచ్చిన తరువాత ఇంటిలో వండిన ఆహార పదార్థాలతో అందరూ కలసి భోజనం చేశారు.

వంతెనకు మరమ్మతులు

సుండుపల్లె : ఇటీవల కురిసిన వర్షాలకు పత్తివాండ్లపల్లె నుంచి సుండుపల్లెకు వెళ్లే రహదారిలో ఉన్న కాజ్‌వే వంతెన దగ్గర తూములో చెట్లు ఇరుక్కుపోవడంతో నీటి ప్రవాహ ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయింది. గ్రామస్తులు సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే ఈఓపీఆర్‌డీ సురేష్‌బాబు జేసీబీ యంత్రంతో రోడ్డును బాగుచేయించారు.

ప్రమాదపుటంచున 'రాతిచెరువు'


ప్రమాదకరంగా ఉన్న రాతిచెరువు మొరవ

సుండుపల్లె : మండల పరిధిలోని పోచంవాండ్లపల్లి సమీపంలో రాతిచెరువు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి మొరవ దగ్గర తెగిపోయే స్థితిలో ఉందని గ్రామస్తులు తెలిపారు. చెరువులోకి బేరిన్ చెరువు నుంచి గరిష్టంగా నీరు రావడంతో చెరువు నిండిపోయి తెగిపోయే స్థితిలో ఉందని వారు చెప్పారు. చెరువు తెగిపోతే 3 గ్రామాలలో వ్యవసాయ పొలాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీమా పథకాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న మేనేజర్ రాజశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఉర్లగడ్డపోడు పంచాయతీ గిరిజన కాలనీలో రాఘవరాజపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే బీమా పథకాలు వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

నిర్మాణం అర్ధాంతరం.. నిరవధిక విద్యుత్ ప్రశ్నార్థకం

నిలిచిపోయిన గాదెల విద్యుత్ సబ్ స్టేషన్ పనులు

- మెరుగైన విద్యుత్ కోసం రైతుల పడిగాపులు
- గత ప్రభుత్వంలోనే అనుమతులు
- పనులు పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలంటున్న ప్రజలు


ఆగిపోయిన తల్లెంవారిపల్లి సబ్ స్టేషన్ పనులు

ఓబులవారిపల్లె : గాదెల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో తల్లెంవారిపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ అనుమతులు ఇవ్వడం జరిగింది. గుత్తేదారులు ఇందుకు సంబంధించి పనులు కూడా ప్రారంభించారు. రైతులు ఇక మెరుగైన విద్యుత్ తమ పంట పొలాలకు అందుతుందని ఎంతో సంతోషించారు. అయితే కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక సబ్ స్టేషన్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో గాదెల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమకు నాణ్యమైన విద్యుత్ ఇంకెప్పుడు అందుతుందోనన్న ఆవేదనను వెలిబుచ్చుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా సబ్ స్టేషన్

అటవీ శివారు గ్రామమైన గాదెల పరిసర గ్రామాల రైతులకు, గృహాలకు మెరుగైన విద్యుత్ అందకపోవడంతో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారు. అసలు గ్రామానికి ఎప్పుడు సబ్ స్టేషన్ వస్తుందో అన్న భావనలో ప్రజలు ఉండేవారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో తల్లెంవారిపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించారు. దాదాపు ఒక కోటి యాభై లక్షల వ్యయంతో మంజూరు చేసి పనులు సైతం ప్రారంభించారు.

నిలిచిపోయిన సబ్ స్టేషన్ పనులు..

గత ప్రభుత్వంలో శరవేగంగా జరుగుతున్న పనులు కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే అడుగు కూడా ముందుకు పడటంలేదు. పనులు ఎందుకు అగిపోయాయో తెలియని పరిస్థితుల్లో విద్యుత్ శాఖ అధికారులు ఉండటం గమనార్హం. కాగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ బేస్ మట్టం పూర్తి చేసి విద్యుత్ స్తంభాలు, సామగ్రి సిద్ధం చేశారు. అంతే అంతకుమించి ఇప్పటి వరకు పనులు పునప్రారంభమైన సందర్భం లేనేలేదు. కూటమి ప్రభుత్వం గాదెల చుట్టుపక్కల గ్రామాలపైన నిర్లక్ష్యం కారణంగానే పనుల్లో పురగతి లేదనే వాదన ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసి గృహాలకు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



గాదెల సబ్ స్టేషన్ పనులు ఎందుకు నిలిచిపోయాయో తెలియదు. కూటమి పార్టీల నాయకులు, అధికారులు అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేసి రైతులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేలా చొరవ చూపాలి.

– రామకృష్ణయ్య మాజీ ఎంపీపీ, ఓబులవారిపల్లి

నిరవధిక విద్యుత్ సరఫరా చేయాలి



గాదెల చుట్టుపక్క గ్రామాల్లో విద్యుత్ సమస్య అధికంగా ఉంది. దీంతో గత ప్రభుత్వం సబ్ స్టేషన్‌ను తల్లంవారిపల్లెలో కేటాయించి పనులు ప్రారంభించింది. ఏడాదిన్నరగా నిలిచిన పనులను ప్రారంభించి ప్రజలకు నిరవధిక విద్యుత్‌ను సరఫరా చేయాలి.

– మన్నూరు రాజగోపాల్ రెడ్డి, రైతు, తల్లెంవారిపల్లి, ఓబులవారిపల్లి

రాజంపేట టౌన్ సీఐగా నాగార్జున

రాజంపేట : రాజంపేట టౌన్ సీఐగా నాగార్జున శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కడప వీఆర్ నుంచి రాజంపేట టౌన్‌కు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రాజాను కొండాపురం సీఐగా బదిలీ చేశారు. ఈయనకు పట్టణ పోలీసులు పుష్పగుచ్ఛాలను అందచేసి, స్వాగతం పలికారు.

మన్నూరు సీఐగా ప్రసాద్‌బాబు

మన్నూరు సీఐగా జె.ప్రసాద్‌బాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన కుళ్లాయప్పను రాయచోటి ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. వాయల్పాడు సీఐగా పనిచేస్తున్న ప్రసాద్‌బాబును ఇక్కడికి బదిలీ చేశారు. సీఐకు టౌన్ పోలీసుస్టేషన్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

పంద్రాగస్టు వేడుకలకు సుండుపల్లె విద్యార్థులు

సుండుపల్లె : రాయచోటిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సుండుపల్లె జెడ్పీహెచ్‌ఎస్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల స్కౌట్ మాస్టర్ నాగేంద్రబాబు, గైడ్ కెప్టెన్ రాధారాణిలు తెలిపారు. ఇందులో నలుగురు స్కౌట్స్ విద్యార్థులు, నలుగురు గైడ్ విద్యార్థినులు ప్రదర్శనలు ఇవ్వనున్నారని చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షకీరాబేగం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

అత్తిరాలలో భక్తుల సందడి

- భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ
- గంగా హారతి, త్రేతేశ్వరునికి ప్రత్యేక పూజలు


త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణలో భక్తబృందం

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవక్షేత్రమైన అత్తిరాలలో శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. శుక్రవారం రాత్రి గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రేతేశ్వరునికి మొక్కులు చెల్లించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ముందుగా బహుదా నదికి గంగా హారతి నిచ్చారు. పోలి అప్పారాజుపేట గ్రామానికి చెందిన కీ.శే.తుమ్మలపల్లి ఆదిలక్షుమ్మ, రమణయ్య దంపతుల జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు కామాక్షి మాతకు చీరె, సారె అందించారు. అనంతరం శివనామస్మరణతో కామాక్షిదేవి, త్రేతేశ్వరుడిని ప్రత్యేక పల్లకిలో ఊరేగిస్తూ గిరిప్రదక్షిణను చేపట్టారు. కాగా తుమ్మలపల్లి మిద్దె గంగయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు అందించగా, చెర్రీస్ స్కూల్ యాజమాన్యం భక్తులకు బస్సు సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

రైతన్నా.. జర భద్రం!

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్లతో అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట


చిన్నమండెం మండలంలో పొలంలో రైతు ఏర్పాటు చేసుకున్న బోరు మోటారు

చిన్నమండెం : అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే రైతులు తమ పొలాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. పంటలకు నీరు పెట్టడం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద ఎక్కువగా పనిచేస్తుంటారు. రైతులు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే మృత్యువాత పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్ర, స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా

స్టార్టర్ డబ్బాలను మోటార్ పక్కనే పొలంలో ఉంచి కవర్లు కప్పుతుంటారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంటుంది. వర్షం కురిసినా, బోరు నీరు ఎగజిమ్మినా డబ్బాల్లోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫేజుదో కూడా తెలియకుండా ఉంటుంది. నేరుగా స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫేజు అమర్చుకోవాలి. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి. చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్లు, ఫేజులు బిగియడంతో ఎలుకలు డబ్బాలో చేరి తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకోగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

విద్యుత్ తీగలతో ప్రమాదం

గాలివానకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగించుకుని వైర్లను ఇంటికి తీసుకువస్తారు. ఇంట్లో వైర్లు ఉంచినప్పుడు ఎలుకలు కొరికే అవకాశం ఉంది. మరుసటి రోజు మోటార్ వైర్లు తగిలించేటప్పుడు వాటిని సరిచూసుకోవాలి. పాత వైర్ల కంటే కొత్త వైర్లు బిగించుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న పొలాల్లో కొంత మంది కర్రల సహాయంతో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి వర్షానికి, గాలి కింద పడుతుంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లోకి వెళితే కాళ్లకు తగిలి విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులతో మాట్లాడి స్తంభాలను ఏర్పాటు చేయించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొలాల్లో మోటార్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు
- టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి
- వర్షపు నీరు, తేమ తగలని చోట వాటిని అమర్చాలి
- ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి
- విద్యుత్ మోటార్‌లో అంతరాయం ఏర్పడితే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి
- ఫీజులు పోతే విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో వాటి మరమ్మతులు చేయించుకోవాలి

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకరాదు. కరెంటు వైర్లను తాకుతున్న చెట్లను ముట్టుకోవద్దు. పొలాల్లో స్టార్టర్ల మరమ్మతులకు గుర్తైతే ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. స్వయంగా ఫీజులు వేయడం వంటి చిన్నచిన్న పనులు చేయరాదు. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడితే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలి. విద్యుత్ ప్రమాదాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి.

– రాజేష్, ఏఈ, చిన్నమండెం మండలం

ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేకుంటే ఎలా?

రాయచోటి జగదాంబసెంటర్ : సచివాలయ ఉద్యోగిని కిడ్నాప్ చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజ డిమాండ్ చేశారు. రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో పని చేసే సౌమ్యను గుర్తు తెలియని వ్యక్తులు ఆఫీస్‌లోకి వచ్చి కిడ్నాప్ చేశారన్నారు. ఆఫీస్‌లోకి వచ్చి సౌమ్యను బెదిరించి కారులోకి ఎక్కించారని, సహచర ఉద్యోగులు, స్థానికులు అడ్డుపడినా వారిని కూడా కత్తులతో భయపెట్టి పారిపోయారని తెలిపారు. ఇలాంటి వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా ఆఫీస్‌లోకి వచ్చి పట్టపగలే కిడ్నాప్ చేస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తుండటం అన్యాయం అని చెప్పారు. ఇలా అయితే ఉద్యోగాలు ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఉద్యోగినికి గతంలో కూడా ఇలా జరిగినా వారిని శిక్షించకపోవడం వల్లే మరోసారి సంఘటన పునరావృతం అయ్యిందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. లేని పక్షంలో గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులందరం కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి


పోలీసు సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే

ఓబులవారిపల్లె : రహదారిపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏనుగుల రవిరాజు హెల్మెట్లను పోలీసు సిబ్బందికి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసులు హెల్మెట్లు ధరిస్తే వారిని చూసి ప్రజలు కూడా హెల్మెట్లు ధరిస్తారన్నారు. కావున ప్రతి ఒక్కరికీ హెల్మెట్‌పై అవగాహన కల్పించాలని తెలియజేశారు. అనంతరం ఆయన పోలీసు సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.మహేష్ నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

రాయచోటి టౌన్ : అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు సోదరి ప్రేమ, ప్రతిష్టతకు నిదర్శనంగా రక్షాబంధన్ నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలియజేశారు. అలాగే మహిళా సంక్షేమం కోసం పెద్దపీట వేసిన ఘనత కూడా మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు.


కోడూరులోని చిట్వేలి బైపాస్ రోడ్డులో చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

చినుకు పడితే చెరువే!


బస్టాండ్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మేజర్ పంచాయతీలో గురు, శుక్రవారాల్లో కొద్దిసేపు కురిసిన వర్షానికే రైల్వేస్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే నీరు నిలిచి చెరువులను తలపించాయి. అలానే పలు దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. దీనికి తోడు ప్రధాన రహదారి శివాలయం నుంచి చిట్వేలి బైపాస్ రోడ్డు వరకు వర్షపు నీరు రెండు అడుగుల మేర ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుకాణాల యజమానులు నిర్లక్ష్యంగా చెత్త, కవర్లు డ్రైనేజీ కాల్వలలో పడేయడం వల్ల ప్రధాన రహదారిలో కాల్వలు పూడిపోతున్నాయి. అధికారులు చర్యలు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తుండటంతో ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. కాల్వలలో నీరు నిలిచి దోమలు అధికమై జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని వర్షపునీరు పోయేవిధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ఓబులవారిపల్లె : మంగంపేట ఆర్‌ఆర్–5 పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించే మాతమ్మ ఆలయ భూమి పూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. శుక్రవారం మంగంపేట ఆర్‌ఆర్–5 కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు పునరావాస స్థలంలో రూ.40 లక్షల వ్యయంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి భూమిపూజ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున గ్రామస్తులు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి మాతమ్మ భూమిపూజలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మినుగు సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజలో పాల్గొన్న తల్లెం భరత్, గ్రామస్తులు

శుభంకరీ.. సర్వభూషణాలంకారీ

శ్రావణ మాస పౌర్ణమి ముందు శుక్రవారాన్ని పురస్కరించుకుని జగజ్జనని, అష్ట ఐశ్వర్యాలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మీకి మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి పూజలు చేశారు. ప్రాతఃకాలమే పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు ఇంటిని, లోగిళ్లను సుందరంగా తీర్చిదిద్ది వాకిళ్లకు మామిడాకులు, అరటి బోదెలను కట్టారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి వ్రతాన్ని నియమ, నిష్టలతో జరిపారు. అలానే లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమైన వంటకాలను ప్రసాదాలుగా సమర్పించారు. కాగా పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు వ్రత ఉద్దేశాన్ని, సిద్ధించే భాగ్యాలను భక్తులకు వివరించారు.

– సాక్షి, నెట్‌వర్క్


రాయచోటి టౌన్: సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు


సంబేపల్లె: ప్రత్యేక పూజలందుకున్న లక్ష్మీదేవి


సిద్దవటం: శ్రీ గంగాభవాని అమ్మవారి ఆలయంలో..


రాయచోటి టౌన్: ప్రత్యేక అలంకరణలో భద్రకాళి


చిన్నమండెం: మల్లూరమ్మను దర్శించుకుంటున్న భక్తులు


లక్కిరెడ్డిపల్లె: వ్రతంలో భాగంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించిన భక్తులు


రాయచోటి టౌన్: 220 కలశాలతో మహిళల ఊరేగింపు


నందలూరు: అమ్మవారి పూజల్లో పాల్గొన్న మహిళలు


పుల్లంపేట: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు